క్లుప్తంగా

అయ్యప్పస్వామికి పడిపూజ



నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వాల్మీకిపురం : స్థానిక కోనేటి వీధిలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం పడి పూజ నిర్వహించారు. అనంతరం స్వామికి అభిషేకం, అర్చన, కర్పూర హారతులు, పడిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మధ్యాహ్నం స్వామిని పుష్ప పల్లకిపై కొలువుంచి వీధుల్లో ఊరేగించారు.

ఆలయానికి ఎమ్మెల్యే చేయూత

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కాట్నగల్లు హరిజనవాడలో వెలసిన రామాలయం అభివృద్ధికి తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి రూ.41,116ల నగదును విరాళంగా ప్రకటించారు. ఇటీవల ఎమ్మెల్యే కాట్నగల్లులో పర్యటించగా కాలనీ వాసులు ఆలయానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ నేపథ్యంలో సదరు నగదును వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గణపతిరెడ్డి, సర్పంచి అనసూయమ్మ, వ్యవసాయ సలహా కమిటి జిల్లా సభ్యుడు కుమార్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, భాస్కర్, ఆనంద్‌రెడ్డి, బాబురెడ్డిల చేతుల మీదుగా సభ్యులకు అందజేశారు.

రేపు మండల సమావేశం

కేవీపల్లె : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈశ్వరమ్మ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. మండలంలో జరిగిన ప్రగతిని శాఖల వారీగా చదివి వినిపించడం జరుగుతుందని తెలిపారు.

భూ రీసర్వే అకస్మిక తనిఖీ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పులికల్లులో జరుగుతున్న సమగ్ర భూ రీ సర్వేను జిల్లా సర్వే, భూ రికార్డుల అధికారి జయరాజ్ గురువారం అకస్మికంగా తనిఖీచేసారు. సర్వే విధానంపై స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. రికార్డులను పరిశీలించి జవాబుదారీగా రీసర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలు ఉంటే సమగ్రమైన రికార్డులతో వచ్చి సహకరించాలని కోరారు. ఆయన వెంట డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే అధికారులు క్రిష్ణమూర్తి, లక్ష్మినారాయణ, రమణారెడ్డి, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

చిరుత సంచారం లేదు

వాల్మీకిపురం : ఓబుళంపల్లి సమీపంలోని వ్యవసాయ పొలాల్లో పిల్లలతోపాటు ఓ చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్తులు స్థానిక తహశీల్దారు ఫిరోజ్‌ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అటవీశాఖ సెక్షన్ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం గురువారం పులి సంచారంపై ఆరా తీసింది. వ్యవసాయ పొలాలను పరిశీలించి పుకార్లేనని స్పష్టం చేశారు. అటవీశాఖ సిబ్బంది శోభ, హరిశంకర్‌రెడ్డి, శేఖర్, సైపుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారి నియామయం

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారిగా మహమ్మద్ వసీమ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. మండల వైద్యాధికారిణి శ్రీవిద్య నుంచి గురువారం నియామక ఉత్తర్వులు అందుకున్నారు. చిత్తూరు అపోలో ఆసుపత్రి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

సోలార్ దీపాలు ఏర్పాటు

కేవీపల్లె : ఏపీ నెడ్‌క్యాప్ డైరెక్టర్ సహకారంతో వివిధ గ్రామాల్లో పది సోలార్ లైట్లు ఏర్పాటు చేసినట్లు నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ ప్రభాకర్ నాయుడు తెలిపారు. మండలంలోని వగళ్ల, కేవీపల్లె, మల్లువారిపల్లె, గర్నిమిట్టలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జి.జయరామచంద్రయ్య, శ్రీనివాసులురెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

మదనపల్లె: రక్తదానంతో ఆపదలో ఉన్న వ్యక్తులకు ప్రాణదానం చేయ వచ్చని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.జి.ఆనందరెడ్డి పేర్కొన్నారు. బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్., మహాకార్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ... సాటి మనుష్యుల ప్రాణాలు కాపాడేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

మదనపల్లె సిటీ : అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని మదనపల్లె వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా అన్నారు. స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ అక్రమ మద్యం, గంజాయి, జూదం వంటి విషయాలపై గోప్యంగా సమాచారాన్ని సేకరించి అధికారులకు తెలియజేయాలన్నారు. ఏఎస్ఐలు సుధాకర్, రమాదేవి, ఏఎస్ఐలు ఇమామ్‌సాహెబ్, రమణ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

బి.కొత్తకోట : మండలంలోని గోళ్లపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు గురువారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. మానవతా సంస్థ ఆధ్వర్యంలో నేటి సమాజంలో స్త్రీ పాత్ర, ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు రూ.5 వేల నగదు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కాంతారావు, యన్.కృష్ణారెడ్డి, జి.రామచంద్రారెడ్డి, మనోజ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థిక ప్రగతే లక్ష్యం



మోతీనగర్‌లో జెండా అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : బలహీన వర్గాల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, రానున్న ఎన్నికల్లోనూ ప్రజలంతా ఆయన్ను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా కోరారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపాలిటీలోని మోతీ నగర్, రామారావుకాలనీ-1 సచివాలయాల్లో స్థానిక కౌన్సిలర్లు ఫర్జానా రఫీ, భానుతో కలిసి సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డులను ఆయన ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళుతున్నారన్నారు. గత ప్రభుత్వాల్లో పథకాలందాలంటే టీడీపీ కార్యకర్తలు లేదా జన్మభూమి కమిటీ సభ్యుల ఆశీస్సులుండాలన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతిపక్షాలు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, జింకా వెంకటాచలపతి, ఉదయ్‌కుమార్, మేస్త్రీ శ్రీనివాసులు, పాల్ చంద్రశేఖర్, రామిశెట్టి శివయ్య, రేణుక, గుండ్లూరురఫీ, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, పాకాలహరి, బావాజీ పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం

కేవీపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ గజ్జెల శృతి పేర్కొన్నారు. మండలంలోని కేవీపల్లెలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించి, సచివాలయ కన్వీనర్లకు మా నమ్మకం నీవే జగన్ కిట్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ జగనన్న చేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాలు గుర్తించి మరోసారి ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్జెల శీన్‌రెడ్డి, పొత్తపు సతీష్‌రెడ్డి, సైపుల్లాఖాన్, యర్రమరెడ్డి, మల్లికార్జున, శ్రీనివాసులు, మహేష్‌రెడ్డిపాల్గొన్నారు.

అభివృద్ధి సీఎంకే సాధ్యం

కలకడ : ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని, రాబోయే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ఎన్నుకోవాలని వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి పేర్కొన్నారు. మండలంలోని కోన పంచాయతీలో సర్పంచి జల్లా రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'వై నీడ్స్ జగన్' కార్యక్రమంలో వారు అభివద్ధి, సంక్షేమ పథకాల ప్రయోజనాలను తెలియజేసే బోర్డును సర్పంచ్ చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. ప్రతి వాలంటీర్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రజా ఆమోదం బ్యాలెట్ నమోదు చేయాలని, ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. అనంతరం కోన బస్టాండ్‌లో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జల్లా.రాజగోపాల్‌రెడ్డి, రామచంద్ర, వెంకటరమణా రెడ్డి, మోహన్‌రాజ్, క్రిష్ణారెడ్డి, సరళ, జివి.కిషోర్, హరినాథరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రవీంద్ర, మాదవరెడ్డి, అంజన్‌కుమార్, నరసింహారెడ్డి, బాబురెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక భరోసా

పెద్దమండ్యం : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక పేర్కొన్నారు. మండలంలోని కోటకాడపల్లె సచివాలయం వద్ద గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ జెండాను, డిజిటల్ బోర్డులను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పారదర్శకంగా పథకాలను అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఈవోపీఆర్‌డి జనార్దన్, సర్పంచ్‌లు భూదేవి, సుధాకర, కంటి విశ్వనాథరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చాంద్‌బాషా, జెసీఎస్ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, కేశవ, వలంటీర్లు పాల్గొన్నారు.

చారావాండ్లపల్లిలో..

వాల్మీకిపురం : ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని, అందరూ ఆశీర్వదించాలని వైస్ ఎంపీపీలు వెంకటరమణ, కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రజుమంలో భాగంగా చారావాండ్లపల్లిలో కరపత్రాలను ఆవిష్కరించి, వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలోనీళ్లభాస్కర్, చెంగల్ రెడ్డి, ఫారుఖ్, నల్లంకి నరసింహులు, మోహన్‌రెడ్డి, రాయుడు, లక్ష్మీనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ముఖ్యమంత్రి ఆశయం

పీలేరురూరల్ : పేదల అభివృద్ధి, సంక్షేమమే జగనన్న ఆశయమని సర్పంచ్ రాజేష్ పేర్కొన్నారు. మండలంలోని ముడుపులవేముల సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ, అభివృద్ధి బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేస్తే అభివద్ధి జరుగుతుందని చెప్పారు. ఈవోపీఆర్‌డీ జయమ్మ, పారుఖ్, నాయకులు లోకనాథరెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

గోపిదిన్నెలో..

తంబళ్లపల్లె : మండలంలోని గోపీదిన్నె సచివాలయంలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అభివద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్లు పార్టీ పతాకాన్ని, సంక్షేమం, అభివద్ధి కార్యక్రమాల సమాచారంతో డిజిటల్ బోర్డు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏ సీయం ఇప్పటి వరకు చేయని అభివద్ధి జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపారన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున, ప్రభాకర్‌రెడ్డిపాల్గొన్నారు.

జనమే మా బలం

కురబలకోట: జనమే జగన్ బలమని రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో తిరిగి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుందని ఎంపీపీ బి.దస్తగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ డీఆర్.ఉమాపతిరెడ్డి, ఎర్రబల్లె సర్పంచ్ ఉప్పతి నాగరత్న అన్నారు. మండలంలోని ఎర్రబల్లెలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జెండా ఎగురవేసి ప్రభుత్వ పథకాలను ఇంటింటా వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పతి ఈశ్వర్ ఆర్సీ ఈశ్వర్ రెడ్డి, రఘునాధరెడ్డి, వేణు, భాస్కర్ రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తే ఆదరించండి

రామసముద్రం : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను అన్ని రకాలుగా ఆదుకుని, అభివద్ధి చేసి ఉంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎంపీపీ కుసుమ కుమారి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కష్టారెడ్డి, మండల కన్వీనర్ నందకిషోర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కేశవరెడ్డి తెలిపారు. మినికి సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సర్పంచులు జమున, భాగ్యలక్ష్మీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మినికి, రాగిమాకులపల్లె పంచాయతీలో సంక్షేమ పథకాల గురించి వివరించారు. వారు మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో రూ.18.62 కోట్లు వివిధ పథకాల ద్వారా ప్రజలు లబ్ధిపొందినట్లు సూచించారు. అనంతరం అభివద్ధి పథకాల బోర్డు ప్రారంభించి, వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గెవన్న, కష్టప్ప, సుజ్ఞానమూర్తి, వీరేగౌడ్, నాగరాజ, సుభాష్ చంద్రబోస్, రమేష్, రాధా పాల్గొన్నారు.



రామసముద్రం : మినికి సచివాలయంలో పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రభుత్వ పథకాల బోర్డు ఆవిష్కరణ



మహల్‌లో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

కలికిరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి, సర్పంచ్ తస్లీమా రియాజ్ అన్నారు. మండలంలోని మహల్‌లో ఆంధ్రప్రదేశ్‌కు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ ఆవరణలో ప్రభుత్వ సంక్షేమ పథకాల డాష్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఉప సర్పంచ్ షబ్బీర్, జేసీఎస్ మండల కన్వీనర్ రెడ్డెప్ప, నాయకులు ఆరిఫుల్లా, సర్దార్ ఖాన్, ఆయుబ్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల ప్రదాత జగనన్న

గుర్రంకొండ: రాష్ట్రంలో సంక్షేమ పథకాల ప్రదాత సీఎం జగన్మోహన్‌రెడ్డి అని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ప్రభుత్వ సలహదారులు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. స్థానిక గుర్రంకొండ, కండ్రిగ గ్రామాల సచివాలయాల్లో ఆంధ్ర ప్రదేశ్‌కు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఏపనిధులిచ్చారో డిజిటల్ బ్యానర్ ద్వారా ప్రదర్శించారు. సచివాలయం దగ్గర వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల రూపంలో కోట్లాది రుపాయలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సమ్రీన్ ముక్తియార్, జయచంద్రారెడ్డి, నాగేంద్ర, అప్పల్ల, ప్రకాష్‌రెడ్డి, రౌనఖ్ బాషా, జమీర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోతిరెడ్డి నాగార్జునరెడ్డి

భవిష్యత్ తరాలకు భరోసా వైఎస్ జగన్



ప్రభుత్వ పథకాలపై మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భవిష్యత్ తరాలకు భరోసా నిచ్చారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మండలంలోని సీటీఎం-1 సచివాలయ పరిధిలో రేగడ, చిన్నాయనచెరువుపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్ బాషా, సర్పంచ్ ఆనంద పార్థసారథి, ఎంపీపీ రెడ్డెమ్మ, వెలుగుచంద్రతో కలిసి ఇంటింటా పర్యటించి ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ నాలుగన్నరేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని తెలిపే బుక్‌లెట్స్ అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో, జగనన్న పాలనలో సంతోషంగా ఉన్నామని, పథకాలన్నీ అందుతున్నాయని ప్రజలు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భావితరాలకు భరోసాగా, జగనన్న ఉన్నారనే ధైర్యాన్ని కల్పించే దిశగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతోందన్నారు. పేద, మధ్యతరగతి వర్గాల అభ్యున్నతికి అనేక పథకాలు అమలుచేసి సీఎం బాసటగా నిలుస్తున్నారని చెప్పారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోతబోలు నాగరాజ, ఆర్‌బీకే చైర్మన్ శివారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ పాగా కువీరప్రతాప్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

వాల్మీకిపురం : వాల్మీకిపురం పంచాయతీలోని శివపురం, నల్లంవాండ్లపల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8:30 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్ష్యుడు నీళ్లభాస్కర్, ఉప సర్పంచ్ కేశవ రెడ్డి తెలిపారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటా తిరిగి సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు.

పెద్దమండ్యంలో కేంద్ర బృందం పర్యటన



వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారురాలితో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

పెద్దమండ్యం : మండలంలో కేంద్ర బృందం సభ్యులు గురువారం పర్యటించారు. బండమీద పల్లె, పెద్దమండ్యం గ్రామాలలో విస్తృతంగా పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఉపాధి హామీ, వాటర్‌షెడ్ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. బండమీదపల్లె పంచాయతీలోని తురకపల్లె నుండి గుర్రంకొండ రోడ్డు వరకు చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్ పనులను తనిఖీ చేశారు. మొక్కల పెంపకంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పెద్దమండ్యంలో వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రతినెలా పొందుతున్న పింఛన్ సొమ్ము విధానంపై ఆరా తీశారు. బయోమెట్రిక్ ద్వారా తీసుకుంటున్నట్లు లబ్ధిదారులు తెలిపారు. పెద్దమండ్యం సచివాలయాన్ని పరిశీలించి పౌర సేవలపై ఆరా తీశారు. వాటర్‌షెడ్ ద్వారా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నిర్మించిన నీటికుంటను పరిశీలించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు, అభివృద్ధి పనులపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు అంకుర్ దహియా, మన్‌మీట్‌సింగ్, మనోజ్‌కుమార రాఘవ్, అనురాగ్ జైశ్వాల్, ఇందిరా దుబే, తేజు ప్రకాష్, డిఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఈవోపీఆర్‌డి జనార్దన్, గ్రామ సర్పంచ్‌లు మొలక బయ్యారెడ్డి, సోదనపల్లె బాషా, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ శ్రీదేవి

కలకడ : మండలంలో బాల్య వివాహాలు నిరోధించడానికి అధికారులతోపాటు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ శ్రీదేవి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఆమె మాట్లాడుతూ హాజరు కాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు తీర్మానం చేయాలని ఆదేశించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి, క్షేత్ర స్థాయి సమస్యలు పరిష్కరించడానికి కృషిచేయాలన్నారు. ఆర్బీకే చైర్మన్ హరినాథరెడ్డి మాట్లాడుతూ మండలంలోని ప్రతి సచివాలయం పరిధిలోని ఆర్బీకేల్లో ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరారు. నూతన పథకాలపై, లబ్ధిపై ప్రజలలో అవగాహణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, రవిచంద్రబాబు, ఎంపీడీఓ పరమేశ్వరరెడ్డి, ఇనయతుల్లా, క్రిష్టారెడ్డి, సుజాత, ముబారక్, రామచంద్ర, విశ్వనాథ్ పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచకుంటే చర్యలు

పెద్దతిప్పసముద్రం : ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచకుంటే చర్యలు తప్పవని ములకల చెరువు క్లస్టర్ ఏపీడీ మధుబాబు సిబ్బందిని హెచ్చించారు. మండలంలోని క్షేత్ర, సాంకేతిక సహాయకులతో గురువారం ఆయన సమీక్షించారు. ఏపీడీ మాట్లాడుతూ పీటీఎంను కరవు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించడమే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని, విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారులకు తెలియజేస్తామని హెచ్చరించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

కలికిరి : జిల్లాలో గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని గ్రంథాలయ శాఖ డీడీ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. కలికిరి గ్రంథాలయ శాఖను ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు మధుబాలతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవరచుకోవాలన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు వకృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. రాజశేఖర్, విజయ్‌కుమార్, ముని పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ: గ్రంథాలయాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డీడీ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. స్థానిక సీటీఎం రోడ్డు లోని శాఖ గ్రంథాలయంలో ప్రముఖ వ్యక్తులను స్మరించుట కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినా గ్రంథాలయాల ప్రాధాన్యం తగ్గలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు సైనారు మధుబాల, వసంత కుమారి, రాజశేఖర్, జనార్దన్‌రెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వాల్మీకిపురం : గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు అని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ అధ్యక్షురాలు మధుబాల అన్నారు. స్థానిక గ్రంథాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలను అందించారు.

కలకడ : కలకడ గ్రంథాలయ శాఖలో ఎస్ఆర్.రఘునాథన్, వెంకట్రమణయ్య చిత్ర పటాలకు గ్రంథాలయాధికారి అమరనాథ్ అన్నారు.పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రముఖుల జీవిత చరిత్ర పుస్తకాలను పాఠకులకు అందజేశారు. ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

అన్ని హంగులతో వంద పడకల ఆస్పత్రి



ఆస్పత్రిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జి.వి.శ్రీనాథరెడ్డి, తదితరులు

పీలేరు : పీలేరు పట్టణంలో వంద పడకల ఆస్పత్రి అన్ని హంగులతో సిద్ధమవుతోందని మాజీ ఎమ్మెల్యే జి.వి.శ్రీనాథరెడ్డి పేర్కొన్నారు. ఆస్పత్రిలో జరుగుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.24 కోట్లతో చేపట్టిన ఆస్పత్రి పనులు దాదాపు పూర్తి కావచ్చాయని తెలిపారు. ఆస్పత్రికి కావాల్సిన ఫర్నీచర్, పరికరాలు, పార్కింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో అధునాతన సౌకర్యాలతో రూపుదిద్దుకుంటున్న పీలేరు వంద పడకల ఆస్పత్రి త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఆస్పత్రి ప్రారంభమైతే మూడు నియోజకవర్గాల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.వి.రాకేష్‌రెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు షఫీ, హుమయూన్, ఉదయ్‌కుమార్, స్టాంపుల నరసింహారెడ్డి, కంభం భాస్కర్‌రెడ్డి, హబీబ్‌బాషా, ఈఈ కరీముల్లా, డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సహకార సంఘాలకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

మదనపల్లె సిటీ : సహకార సంఘాల బలోపేతానికి సాంకేతిక పరిజ్ఞానం అవసరమని సహకార శాఖ సీనియర్ ఇన్స్‌పెక్టర్ రఘునాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకులో జరిగిన సహకార వారోత్సవాల్లో భాగంగా సహకార సంఘం డిజిటలైజేషన్ కోసం సాంకేతికను స్వీకరించుట, అప్‌గ్రేడ్ చేయడంపై సమావేశం జరిగింది.

ఆయన మాట్లాడుతూ డిజిటలైజేషన్‌తోనే సంఘం సభ్యులకు మంచి సేవలు అందించగలుగుతామన్నారు. టౌన్ బ్యాంకు సీఈఓ ప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకులో సాంకేతికతను అమలు చేశామని, ఇందులో భాగంగా కోర్ బ్యాంకింగ్ వ్యవస్థ రూపొందిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు బ్రాంచీలలో ఎక్కడైనా లావాదేవీలు చేసుకోవచ్చునన్నారు. ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్, ఏటీఎం సేవలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. త్వరలో మొబైల్ బ్యాకింగ్ సేవలు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు సుధారాణి, రవి చంద్రారెడ్డి, రాధిక,సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం, వాలంటీర్ వ్యవస్థ రెండు కళ్లు

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి



ఎగువ సరిమడుగులో నీటి గుంతలు పరిశీలిస్తున్న పోతిరెడ్డి నాగార్జునరెడ్డి

గుర్రంకొండ: ప్రజలతో మమేకమై ఉండే సచివాలయం, వాలంటీరు వ్యవస్థలు ప్రభుత్వానికి రెండు కళ్లు అని రాష్ట్ర పంచాయతీరాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖల ప్రభుత్వ సలహదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలు తీరు, అభివృద్ధి పనులను పరిశీలించారు. తొలుత మండలంలోని క్రిష్ణాపురం సమీపంలోని ఉపాధి కూలీలతో మాట్లాడాడు. సరిమడుగు సచివాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని, సూచించారు. అక్కడే వాలంటీర్లతో మాట్లాడుతూ ప్రజల్లో సంక్షేమ పథకాలను తీసుకెళ్లే బాధ్యత వాలంటీర్లపై ఉందన్నారు. వాలంటీర్ల సేవల్ని గుర్తిస్తూ వారి జీతం రూ. 10 వేలు పెంచేందుకు జగనన్న అన్ని చర్యలు చేపడతున్నారని అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడాడు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. నడిమికండ్రిగలో సచివాలయం, ఆర్బీకేలను తనిఖీచేశారు. అక్కడి నుండి చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మకొండ ఆలయాన్ని సందర్శించారు. అనంతరం గుర్రంకొండ మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, మహిళాసంఘాల సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఎల్‌డీవో లక్ష్మీపతి, జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, అప్పల్ల, ప్రకాష్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశులు, జావీద్, రవీంద్ర పాల్గొన్నారు.

నూతన వధూవరులకు మంత్రి ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పీలేరురూరల్: స్థానిక ఎస్ కన్వెన్షన్ హాల్ నందు పులిచెర్ల మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి కుమార్తె దేదీప్యారెడ్డి, రాయచోటికి చెందిన గంగిరెడ్డి కుమారుడు మోహన్ సుభాష్‌రెడ్డిల నిశ్చితార్థం కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్తు శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఆశీర్వదించారు. పెద్దిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, హరి ప్రసాద్‌రెడ్డి, హబీబ్‌బాషా పాల్గొన్నారు.